



పాపవినాశనం డ్యాం గేట్లు ఎత్తివేత

తిరుమల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వర్షాలకు తిరుమలలోని పాపవినాశనం డ్యాం కూడా నిండిపోవడంతో శనివారం మధ్యాహ్నం గేట్లు ఎత్తివేశారు. గురువారానికే తిరుమలలోని ఐదు డ్యాములు 85 శాతానికి నిండిపోయాయి. గోగర్భం డ్యాం శుక్రవారం పూర్తిస్థాయిలో నిండిపోవడంతో ఓ గేటును ఎత్తివేసి నీటిని దిగువకు విడుదల చేశారు. శనివారం ఉదయానికి పాపవినాశనం డ్యాం కూడా నిండిన క్రమంలో మధ్యాహ్నం 12 గంటలకు గేట్లు తెరిచి నీటిని విడుదల చేశారు. మరో మూడు డ్యాములు కూడా దాదాపుగా నిండిపోయాయి.

ఆలయాల సందర్శనకు ప్రత్యేక బస్సు

శ్రీకాళహస్తి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని 27వ తేదీన ఆలయాల సందర్శనకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ శ్రీకాళహస్తి డిపో మేనేజరు రేవతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం శ్రీకాళహస్తి బస్టాండు నుంచి బస్సు బయలుదేరి గుడిమల్లం, అప్పలాయగుంట, వకులమాత ఆలయం, ముక్కోటి, తలకోనకు వెళ్లి తిరిగి సాయంత్రం 5 గంటలకు శ్రీకాళహస్తికి చేరుతుందని తెలిపారు. టిక్కెట్టు ధర రూ.450గా నిర్ణయించామని వెల్లడించారు.

పెద్దశేష వాహనంపై మలయప్ప దర్శనం

నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమలలో శనివారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి పెద్దశేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్వామి, అమ్మవార్లు తిరుమాడవీధుల్లో ఊరేగారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, గోవిందనామ స్మరణలు, కర్పూర హారతుల నడుమ పెద్దశేష వాహనం వైభవంగా జరిగింది. రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి





‘గ్రేటర్’తో బహిర్గతమైన కూటమి నేతల సమన్వయ లోపం

● ప్రభుత్వ కీలక నిర్ణయాన్ని సైతం ప్రచారం చేసుకోలేని దైన్యం

తిరుపతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు అంశంతో తిరుపతి నియోజకవర్గ కూటమి నేతల నడుమ సమన్వయం ఏపాటిదో బహిర్గతమైంది. తిరుపతి నగర చరిత్రను, అభివృద్ధిని మేలి మలుపు తిప్పే ప్రభుత్వ కీలక నిర్ణయాన్ని సైతం ప్రచారం చేసుకోలేని దైన్యం కూటమి పార్టీల నేతలను ఆవహించింది. తిరుపతితో పాటు పొరుగున ఉన్న చంద్రగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాలతో ముడిపడిన గ్రేటర్ ప్రతిపాదనపై జిల్లా యంత్రాంగం అధికారిక కసరత్తు మినహా కూటమి పార్టీల నేతల నడుమ రాజకీయంగా కసరత్తు నడిచిన దాఖలాలు లేవు. తీరా అధికారిక ప్రక్రియ ప్రారంభమయ్యే తరుణంలో కూడా దానికనుగుణంగా సన్నద్ధం కాలేకపోవడం కూటమి పార్టీల శ్రేణులను తీవ్ర నిరుత్సాహానికి, నైరాశ్యానికి గురి చేస్తోంది. రావాల్సిన స్థాయిలో మైలేజీ రాలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

గ్రేటర్ తిరుపతి... కీలక నిర్ణయం

గ్రేటర్ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ప్రతిపాదన ఆషామాషీ కాదు. నగర చరిత్రను, అభివృద్ధిని మేలి మలుపు తిప్పే కీలక అంశం. సీఎం చంద్రబాబు సొంత జిల్లా తిరుపతి అభివృద్ధి పట్ల మరింత నిబద్ధతతో ఉంటారన్నది ఎవరికీ తెలియంది కాదు. గరుడ వారధి మొదలుకుని ఐఐటీ, ఐసర్, ఐఐడీటీ, స్విక్కార్ వంటి ప్రతిష్ఠాత్మక జాతీయ, అంతర్జాతీయ విద్యా, వైద్య సంస్థల ఏర్పాటుకు కారకులు ఆయనే అన్నది కూడా అందరికీ తెలిసిందే. అలాంటిది తిరుపతి నగర కార్పొరేషన్ పరిధిని 30 చదరపు కిలోమీటర్ల నుంచి ఒకేసారి 284 చదరపు కిలో మీటర్లకు విస్తరించే ప్రయత్నం చిన్న విషయం కాదు. తిరుపతిని భవిష్యత్తులో మహానగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చంద్రబాబు తీసుకున్న నిర్ణయాన్ని ఈ దశకు తీసుకురావడానికి జిల్లా యంత్రాంగానికి ఎనిమిది నెలలకు పైగా పట్టింది. ఈ ప్రతిపాదన అమలైతే నగర జనాభా 4.50 లక్షల నుంచి 7.50 లక్షలకు, గ్రాంట్లు కాకుండా వార్షికాదాయం రూ.149 కోట్ల నుంచి రూ. 182 కోట్లకు పెరుగుతుంది. కార్పొరేషన్ పరిధి తిరుపతి నియోజకవర్గం దాటి చంద్రగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లోకి విస్తరిస్తుంది.

గ్రేటర్ ప్రతిపాదనకు ముందు జరగని రాజకీయ కసరత్తు

గ్రేటర్ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ప్రతిపాదనను మున్సిపల్ కౌన్సిల్ సమావేశం అజెండాలో చర్చకు పెట్టే ముందు కేవలం అధికారిక కసరత్తు మాత్రమే జరిగింది. రాజకీయంగా కసరత్తు గానీ, సన్నద్ధత కానీ జరగలేదు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో కలెక్టర్ అధికారిక కసరత్తు చేస్తున్న సంగతి కూటమి పార్టీల ముఖ్య నేతలందరికీ తెలుసు. ఈనెల 24న మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చర్చకు పెడతారని కూడా తెలుసు. అయితే అంతకంటే ముందుగానే సీఎం ఆదేశాలు, అధికారికంగా జరుగుతున్న ప్రయత్నాలు, దానివల్ల కలిగే ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకుపోవడంలో కూటమి నేతలు ఘోరంగా విఫలమయ్యారు. తిరుపతిలోని కూటమి పార్టీల ముఖ్య నేతలు చంద్రగిరి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేలను కలుపుకుని ప్రెస్‌మీట్ పెట్టి సీఎం నిర్ణయాన్ని వెల్లడించే ప్రయత్నం కూడా చేయలేదు. తీరా మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం పెట్టగా దాన్ని తమకు అనుకూలంగా మలచుకునేందుకు వైసీపీ కార్పొరేటర్లు గట్టిగా ప్రయత్నించారు. ముందే సన్నద్ధమై ప్లకార్డులు సైతం సమావేశంలోకి తెచ్చుకోవడం గమనార్హం. థ్యాంక్యూ సీఎం అనే ప్లకార్డులు ప్రదర్శించాలన్న ప్రయత్నం కూడా కూటమి నేతల నుంచి జరగకపోవడం శ్రేణుల్ని బాధిస్తోంది.

కలిగే ప్రయోజనాలు ఇవీ..

నగర స్థాయి పెరిగే కొద్దీ కేంద్ర ప్రభుత్వ పథకాల కింద విరివిగా నిధులు మంజూరవుతాయి. కొత్తగా కార్పొరేషన్ పరిధిలో చేరే ప్రాంతాల్లో భూములు, స్థలాల విలువ పెరుగుతుంది. వ్యవసాయ భూములు సైతం నివాస, వాణిజ్య విలువను సంతరించుకుంటాయి. రియల్ ఎస్టేట్ రంగం జోరందుకుంటుంది. నగర విస్తృతితో కొత్త లే అవుట్లు, ప్లాన్ అప్రూవల్ వంటి వాటితో నగర పాలక సంస్థ ఆదాయం పెరుగుతంది. ఆ నిధులన్నీ తిరిగి అభివృద్ధి కార్యక్రమాలకు అందుబాటులోకి వస్తాయి. అలాగే విలీన గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు, పారిశుధ్య నిర్వహణ వంటి మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయి. అంతిమంగా ఇతర ప్రాంతాల నుంచి వలసలు పెరుగుతాయి. వ్యాపార కార్యకలాపాలు పెరిగి ఉపాధి అవకాశాలు లభిస్తాయి.



మూడు బోట్లు... 24 గంటలు

అవిశ్రాంతంగా శ్రమించిన పోలీసులు, రెస్క్యూ టీంలు

గల్లంతైన బాలుర మృతదేహాలు లభ్యం





తిరుపతి(నేరవిభాగం), రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం వద్దనున్న స్వర్ణముఖి నదిలో శుక్రవారం గల్లంతైన నలుగురు విద్యార్థుల ఆచూకీ కోసం అధికారులు, పోలీసులు 24 గంటలు... మూడు బోట్లతో ముమ్మరంగా జరిపిన గాలింపు చర్యలు ఫలించాయి. వేదాంతపురం పంచాయతీ, రామదాసుకాలనీకి చెందిన మునస్వామి రెడ్డి కుమారుడు బాలు(16) మృతదేహం శుక్రవారం లభ్యం కాగా శనివారం మధ్యాహ్నానికి తేజు, ప్రకాష్ మృతదేహాలు లభించాయి. సాయంత్రానికి మునిచంద్ర(15) మృతదేహం దొరికింది. చంద్రగిరి ఎమ్మెల్యే నాని, ఎస్పీ సుబ్బరాయుడు, ఆర్డీవో రామ్మోహన్‌రావు, జిల్లా అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీ ప్రసాద్, సీఐలు, ఎస్‌ఐలు, ఫైర్ సిబ్బంది దగ్గరుండి సహాయక చర్యలు ముమ్మరం చేశారు. శనివారం తెల్లవారుఝామున 5 గంటల నుంచి మూడు బోట్ల ద్వారా దాదాపు 12 గంటల పాటు నది మొత్తం గాలించారు.

శోకసంద్రంలో వేదాంతపురం

● నది వద్ద మిన్నంటిన తల్లిదండ్రుల ఆర్తనాదాలు

తిరుపతిరూరల్, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. గ్రామానికి ఆనుకుని ఉన్న స్వర్ణముఖి నది వంకలో శుక్రవారం సాయంత్రం గల్లంతైన నలుగురు బాలురూ అసువులుబాయడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. బిడ్డల ఆచూకీ కోసం శుక్రవారం సాయంత్రం నుంచి ఎదురుచూసిన తల్లిదండ్రులకు చివరకు కడుపుకోత మిగిలింది. చేతికందే వయస్సు బిడ్డలు మృతదేహాలుగా బయటకు రావడంతో ఆర్తనాదాలు మిన్నంటాయి. 'కడుపుకోత మిగిల్చి వెళ్లారా నాయనా' అంటూ కిందపడి దొర్లుతూ రోదించారు. వీరి రోదన చూసిన గ్రామస్తులు కంటతడిపెట్టారు.

● ఎంతవెతికినా కనిపించవేమినాయనా..

చిన్న కుమారుడు బాలు మృతదేహం శుక్రవారమే లభించడంతో పుట్టెడు దుఖంతో ఉన్న మంజుల, మునస్వామిరెడ్డి దంపతులు శనివారం ఉదయం నదివద్దకు చేరుకుని బోరున విలపించారు. ఉదయం 10 గంటలు దాటుతున్న పెద్ద కుమారుడు తేజ ఆచూకీ దొరక్కపోవడంతో 'ఎంతవెతికినా కనించవేమినాయనా.. ఎంతమంది వెతుకుతున్నా కనిపించకుండా ఎక్కడున్నావు నాయనా' అంటూ తల్లి మంజుల బోర్లాపడి గుండెలవిసేలా రోదించారు. 'తమ్ముడు పుట్టిన రోజున ఇద్దరూ మాకు దూరమయ్యారా' అంటూ రోధించడం అందరినీ కంటతడి పెట్టించింది. 'మేము బతికేదెలా దేవుడా' అంటూ కన్నీరుమున్నీరుగా విలపించారు. వీరిని ఓదార్చడం అక్కడున్న వారెవరివల్ల కాలేదు. అప్పటికే అక్కడికి చేరుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని మునస్వామిరెడ్డిని ఓదార్చారు.

- మంజుల, బాలు, తేజల తల్లి

● సొమ్మసిల్లిన మునిచంద్ర తల్లి ఎల్లమ్మ

నదిలో గల్లంతైన కుమారుడు మునిచంద్ర కోసం ఆ తల్లి గుండెలవిసేలా రోదించింది. శనివారం ఉదయం కుటుంబ సభ్యులతో కలసి నదివద్దకు చేరుకుని కుమారుడి ఆచూకీ కోసం ఎదురు చూసి..చూసీ సొమ్మసిల్లింది. ఏడ్చి..ఏడ్చి కన్నీరు ఇంకిపోయింది. మునిచంద్ర నాయనమ్మ మనవడిని తలచుకుని ఎక్కిఎక్కి ఏడ్చింది. 'మాకెందుకు అన్యాయం చేశావు దేవుడా' అంటూ బోరున విలపించింది. సాయంత్రానికి మునిచంద్ర మృతదేహం నదిలో లభించింది. తండ్రి మునిశేఖర్ మౌనంగా కంటతడిపెట్టడం అందరినీ కలచివేసింది. వీరి చిన్న కుమారుడు కూడా ఈతకు వెళ్లిన ఏడుగురిలో ఒకరని, అదృష్టవశాత్తు క్షేమంగా బయటపడ్డాడని గ్రామస్తులు అంటున్నారు.



సొమ్మసిల్లిన ఎల్లమ్మ

కళ్లెదుటే స్నేహితులు మునిగిపోయారు : విష్ణువర్ధన్



నాతోపాటు ఏడుగురు స్నేహితులు ఈత కోసం వచ్చాం. ఇసుక దిబ్బపై ఆడుకుంటూ ఉండగా ప్రవాహ ఉధృతి పెరిగింది. స్నానం చేస్తున్న నలుగురు కొట్టుకుపోయారు. నాతో పాటు మరో యువకుడు నదిలోని దర్భను పట్టుకోవడంతో బయటపడ్డాం. కళ్లెదుటే స్నేహితులు మునిగిపోవడం బాధ కలిగించింది.

ఇసుకదిబ్బే మృత్యు కుహరంగా..

నదిలో నిల్వ చేసిన ఇసుక దిబ్బపైనే గల్లంతైన బాలురు సరదాగా కేరింతలు కొడుతూ ఈతకు దిగారని తెలుస్తోంది. వీరు విప్పిన దుస్తులు, చెప్పులు కూడా దిబ్బపైనే కనిపించాయి. నీటి ప్రవాహం పెరగడంతో ఉధృతికి బాలురు గల్లంతయ్యారు. తిరుపతి రూరల్ మండల పరిధిలోని స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతంలో ఎన్నో సంవత్సరాలుగా ఇసుక మాఫియా అనధికారికంగా ఇసుకను తోడేస్తున్నారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు చేపట్టారు. దీంతో తొండవాడ నుంచి తనపల్లె వరకూ నదిపొడవునా పెద్దపెద్ద గోతులు ఏర్పడి ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా ఇసుక అక్రమ రవాణా ఆగడంలేదు. నదిలోకి వివిధ మార్గాల్లో ప్రవేశించి ఇసుకను తోడేసి విక్రయాలు చేపడుతున్నారు. ఇసుకను తోడేయడం వల్లే ఈ ప్రాంతంలో పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయని గ్రామస్తులు అంటున్నారు.

ఘటన బాధాకరం : ఎస్పీ



తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం స్వర్ణముఖి నదిలో జరిగిన ఘటన బాధాకరమని ఎస్పీ సుబ్బరాయుడు అన్నారు. నదులు, వాగులు, వంకల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మన ఊరు, మనకు తెలిసిన, తిరిగిన ప్రాంతం కదా అని అలసత్వం పనికి రాదన్నారు. ఇప్పటికే వాగులు, వంకల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు. మృతుల కుటుంబాలకు పోలీసు శాఖ తరపున సానుభూతి తెలిపారు.

తుఫాన్‌తో అప్రమత్తంగా ఉండండి

● సెలవుల రద్దు ● డిస్కం సీఎండీ శివశంకర్



తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం వల్ల సదరన్ డిస్కం పరిధిలో ఉన్న తొమ్మిది జిల్లాల్లో విద్యుత్ అధికారులు, ఉద్యోగులు, కార్మికులు అప్రమత్తంగా ఉండాలని ఆ సంస్థ సీఎండీ శివశంకర్ హెచ్చరికలు జారీ చేశారు. తిరుపతిలోని సదరన్ డిస్కం కార్యాలయం నుంచి శనివారం తొమ్మిది జిల్లాల ఎస్‌ఈలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. తుఫాన్ తీరం దాటేవరకు క్షేత్ర స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు సెలవులు రద్దు చేశామన్నారు. ప్రతి ఒక్కరు కంపెనీ పరిధిలోని సెక్షన్లలో జేఎల్‌ఎం, ఏఎల్‌ఎం, లైన్‌మెన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, సబ్‌ఇంజనీర్లు, ఏఈలు, డీఈఈలు, ఈఈలు, ఎస్‌ఈలు 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రధానంగా ఆది, సోమ, మంగళవారాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షం తీవ్రత ఆధారంగా ఎప్పటికప్పుడు కంట్రోల్ రూమ్‌లకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఉమ్మడి ఐదు జిల్లాలకు ఐదుగురు సీజీఎంలను పర్యవేక్షించడానికి నియమించామన్నారు.

సహాయక చర్యలకు రూ.2 కోట్లు

● భారీ వర్షాల నేపథ్యంలో విడుదల చేసిన ప్రభుత్వం

తిరుపతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో తక్షణ సహాయక చర్యల కోసం రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు రూ.2 కోట్లు విడుదల చేసింది. భారీ వర్షాలు, వరదలు సంభవించే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో తక్షణ సహాయక చర్యలకు నిధులు కేటాయించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. ఇతర జిల్లాల నుంచీ అభ్యర్థనలు రావడంతో స్పందించిన ప్రభుత్వం 11 ప్రభావిత జిల్లాలకు నిధులు విడుదల చేసింది. ప్రభావ తీవ్రత ఎక్కువగా ఉన్న తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు రూ.2 కోట్లు చొప్పున, మిగిలిన 8 జిల్లాలకు రూ.కోటి చొప్పున విడుదల చేసింది.

ముంచుకొస్తున్న మొంథా

● తుఫానుగా మారనున్న వాయుగుండం ● జిల్లాకు భారీ వర్ష సూచన ● రేపు పీజీఆర్ఎస్ రద్దు

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ (0877-2236007) ఏర్పాటు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ఆదివారం సాయంత్రం నుంచి తుఫాన్‌గా బలపడే అవకాశముంది. దీనికి మొంథాగా నామకరణం చేశారు. ఈ తుఫాన్ తీవ్ర ప్రభావం చూపనుందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. జిల్లా అధికారులతో శనివారం ఆయన వర్చువల్ విధానంలో సమీక్షించారు. సోమవారం నుంచి జిల్లాలో అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు మండల కేంద్రాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. నీటి కుంటలు, కాలువలు, చెరువులు, నదీ పరివాహక, సముద్ర తీర ప్రాంతాలకు ఈత కొట్టేందుకు, చేపల వేటకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎలాంటి అవసరమొచ్చినా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబరు 0877-2236007ను సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్పీ సుబ్బరాయుడు, ఇన్‌చార్జి జేసీ మౌర్య, డీఆర్వో నరసింహులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు పీజీఆర్ఎస్ రద్దు

భారీ వర్ష సూచన నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రకటించారు.అధికారులు సహాయక చర్యల్లో ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

తుఫాన్ నష్టం రూ.238కోట్లు

గడచిన నాలుగు రోజులుగా జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు రూ.238కోట్లు ఆస్తినష్టం వాటిల్లింది. 131 కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నాయి. తాత్కాలిక మరమ్మతులకు గాను రూ.10కోట్లు అవసరం కానుంది. ఇరిగేషన్‌కు సంబంధించి రూ.19 కోట్లు, పశుసంవర్థక శాఖకు రూ.6కోట్లు, ఏపీఎస్‌పీడీసీఎల్‌కు రూ.53కోట్లు, పంచాయతీరాజ్‌కు రూ.24కోట్లు, ఉద్యానవన పురపాలక శాఖలకు సంబంధించి కూడా ఆస్తినష్టం వాటిలిందని జిల్లా అధికారులు వివరించారు. ఏడుగురు మృత్యువాతపడ్డారని వెల్లడించారు.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై 25 కేసులు

తిరుపతి(రవాణా), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రవాణాశాఖ, పోలీసు అధికారులు ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై తనిఖీలు చేపట్టారు. తిరుపతి ఆర్టీసీ బస్టాండు సమీపంలో శనివారం రాత్రి మెరుపు దాడులు చేశారు. ఎమర్జెన్సీ ఎగ్జిట్, గాజు బ్రేకర్లు, అగ్నిమాపక పరికరాలు, ఫైర్ అలారం, ప్రథమ చికిత్స కిట్లు పరిశీలించారు. వాహన ధ్రువపత్రాలు, వాహన కండీషన్, డ్రైవర్ల లైసెన్సుల వివరాలు తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 25 కేసులు నమోదు చేసినట్లు ఏఎస్పీ రవి మనోహరాచారి, జిల్లా రవాణాశాఖాధి కారి మురళీమోహన్ తెలిపారు.

3న బార్సిలోనాకు మౌర్య

● స్మార్ట్‌సిటీ ఎక్స్‌పో వరల్డ్ కాంగ్రెస్‌లో పాల్గొననున్న కమిషనర్

తిరుపతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎన్.మౌర్య వచ్చే నెల 3వ తేదీన స్పెయిన్‌కు వెళ్లనున్నారు. ఆ దేశంలోని బార్సిలోనా నగరంలో 4 నుంచి 6వ తేదీ వరకు జరిగే స్మార్ట్ సిటీ ఎక్స్‌పో వరల్డ్ కాంగ్రెస్-2025 సదస్సులో పాల్గొననున్నారు. ఏపీ నుంచి విశాఖ, తిరుపతి మున్సిపల్ కమిషనర్లకు ఈ అవకాశం దక్కింది. ఈ రెండు నగరాలూ కేంద్ర ప్రభుత్వ తొలి స్మార్ట్ సిటీస్ జాబితాలో ఉన్న సంగతి తెలిసిందే. వివిధ దేశాల స్మార్ట్ సిటీ ప్రాజెక్టులను అధ్యయనం చేసి వాటిలో ఏపీలో అమలు చేయదగ్గ విధానాలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించనున్నారు. అలాగే తిరుపతిలో అమలు చేస్తున్న స్మార్ట్ సిటీ ప్రాజెక్టు పద్ధతులను సదస్సు ముందుంచనున్నారు.

దీపావళి బహుమతి పేరుతో రూ.18లక్షలు కాజేశారు

తడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగకు టపాసులు, గిఫ్ట్‌లు ఇస్తామంటూ రూ.18లక్షలు కాజేసిన ఘటన తడ మండలంలో వెలుగు చూసింది. పోలీసుల వివరాల మేరకు.. సూళ్లూరుపేటకు చెందిన కిరణ్‌కుమార్, అరుణ్‌కుమార్ అన్నదమ్ములు. అరుణ్‌కుమార్ అపాచీలో పనిచేస్తుండగా కిరణ్‌కుమార్ సూళ్లూరుపేటలో జిరాక్స్ షాపు నడుపుతున్నాడు. దీపావళి పండుగకు గిఫ్ట్‌లు, టపాసులు ఇస్తామని నమ్మబలికి అపాచీ పరిశ్రమలోని ఉద్యోగుల నుంచి సుమారు రూ.18 లక్షల వరకు వసూలు చేశారు. పండుగ సమయానికి ఇద్దరూ కనిపించకపోవడంతో మోసపోయామని గుర్తించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



తిరుచ్చి వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న ఉభయదేవేరులు

తిరుచ్చిపై ఊరేగిన కల్యాణ వెంకన్న

చంద్రగిరి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో కొలువైన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. నిత్య సేవల్లో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఉత్సవర్లను కల్యాణ మండపంలో వేంచేపు చేసి, ఆగమ శాస్త్రోక్తంగా ఉత్సవర్లకు కల్యాణోత్సవం నిర్వ హించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో స్వామిఅమ్మవార్ల ఉత్సవర్లకు ఊంజల్ సేవ కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఉత్సవర్లను విశేషంగా అలంకరించి, తిరుచ్చి వాహనంపై అధిష్ఠింపజేశారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి తిరుచ్చి వాహనంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమాలలో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేష్ కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునికుమార్‌రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు బాలాజీ రంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారథి, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండిషన్ రిపేర్, సర్వీసింగ్‌పై ఉచిత శిక్షణ

చంద్రగిరి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ద్వారకానగర్‌లోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో నవంబరు 3 నుంచి 31 రోజుల పాటు రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండిషన్ రిపేర్, సర్వీసింగ్‌పై పురుషులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆసంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ సమయంలో శిక్షణార్థులకు ఉచిత భోజనం సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు.వివరాలకు సెల్ 7989680587, 9494951289, 6301717672 నెంబర్లలో సంప్రదించాలని తెలియజేశారు.

స్వర్ణముఖి గలగల.. కళ్యాణి కళకళ

చంద్రగిరి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చంద్రగిరి మండలంలో స్వర్ణముఖినది ఉధ్రుతంగా సాగుతోంది. అలాగే కళ్యాణి డ్యామ్ కళకళలాడుతోంది. స్వర్ణముఖి ప్రవాహంతో పలు గ్రామాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. నడింపల్లి వద్ద స్వర్ణముఖినది తాత్కాలిక కల్వర్టు ప్రమాద స్థాయికి చేరింది. ఐతేపల్లె, కొటాల మార్గంలో పులిత్తివారిపల్లె వద్ద స్వర్ణముఖి వంతెనపై వరద నీరు ఉధ్రుతంగా సాగుతుండడంతో ఎమ్మెల్యే పులివర్తి నాని నడింపల్లె, పులిత్తివారిపల్లె వద్ద స్వర్ణముఖి నదిలో ఉన్న వంతెనలను అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పులిత్తివారిపల్లె వద్ద స్వర్ణముఖినదిపై వంతెన నిర్మాణానికి రూ.14.60 కోట్లు మంజూరు చేయాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డిని ఎమ్మెల్యే కోరారు. అదేవిధంగా స్వర్ణముఖినదిలో జేసీబీ సాయంతో పూడిక తీయాలని అధికారులను ఆదేశించారు. నడింపల్లి వద్ద తాత్కాలిక కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు.



పులిత్తివారిపల్లె వద్ద స్వర్ణముఖిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని, అధికారులు



కళ్యాణి డ్యామ్

కళ్యాణిలో పెరుగుతున్న నీటిమట్టం

ఎ.రంగంపేట సమీపంలోని కళ్యాణి డ్యామ్‌లో నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. మూడు రోజులుగా కురిసిన వర్షానికి శేషాచలం అడవుల నుంచి నీరు వస్తోంది. తుఫాన్‌కు ముందు కళ్యాణి డ్యామ్‌లో 836 అడుగుల నీటి మట్టం ఉండగా బుధవారం రాత్రికి 851 చేరింది. గురువారం సాయంత్రానికి 856 అడుగులు, శుక్రవారం రాత్రికి 860 అడుగులు శనివారం సాయంత్రానికి 863 అడుగులకు చేరిందని డ్యామ్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాలలో తహసీల్దార్ శివరామసుబ్బయ్య, ఎంపీడీవో వెంకటరత్నం, డీఈఈ శ్రీనివాసులు, ఏఈఈలు, అజిత్ కుమార్‌రెడ్డి, రాజాజీ పాల్గొన్నారు.



చిట్టతూరులో నాగాలమ్మకు పూజలు చేస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో నాగాలమ్మకు పూజలు

రామచంద్రాపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిరెడ్డిపల్లి, చిట్టత్తూరు, కాలేపల్లి, అనుపల్లి, రాయలచెరువుపేట, నడవలూరు గ్రామాల్లో శనివారం నాగులచవితి సందర్భంగా నాగప్రతిమలకు విశేష పూజలు జరిగాయి. మహిళలు పుట్టకు పూజలు చేసి పొంగళ్లు పెట్టారు.

పచ్చికాపల్లం రోడ్డంతా వర్షపునీరు

ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు



మిట్టూరు వద్ద ఆర్‌అండ్‌బీ రహదారిపై ప్రవహిస్తున్న వర్షపునీరు

రామచంద్రాపురం, అక్టోబరు 25((ఆంధ్రజ్యోతి): తీవ్ర వర్షాల నేపథ్యంలో తిరుపతి -పచ్చికాపల్లం ప్రధాన రహదారిపై వర్షపునీరు ప్రవహిస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. తిరుపతి నుంచి రామాపురం, మిట్టూరు, పీవీపురం, రాయలచెరువుపేట, బాదూరు వద్ద రోడ్డు పక్కన ఉన్న కాలువలు పూడి పోవడంతో వర్షపునీరు రోడ్డుపైకి వస్తోంది. అదే సమయంలో రోడ్డు కోతకు గురై ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే భారీ వాహనాలు వేగంగా వచ్చే సమయంలో పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు తడసి ముద్దవుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు కోతకు గురికాకుండా ఉండేందుకు వర్షపునీరు వచ్చే ప్రాంతాల్లో రోడ్డుపక్క కాలువలు తీయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వైభవంగా నాగుల చవితి

చంద్రగిరి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం వైభవంగా నాగుల చవితి వేడుకలను నిర్వహించారు. చంద్రగిరి జాతీయ రహదారిలోని నాగాలమ్మ ఆలయం వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో పూజలు చేశారు. చంద్రగిరిలోని మూలస్థాన ఎల్లమ్మ ఆలయం, శ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయం, శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, తొండవాడ అగస్త్యేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



చంద్రగిరి జాతీయ రహదారిలో నాగాలమ్మకు పూజలు

భాకరాపేట ఘాట్‌లో టమోటా లారీ బోల్తా

డ్రైవర్, క్లీనర్ క్షేమం

చంద్రగిరి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండల పరిధిలోని భాకరాపేట ఘాట్ రోడ్డులో శనివారం తెల్లవారు జామున టమోటా లోడుతో వస్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌లు క్షేమంగా బయటపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. భాకరాపేట నుంచి తిరుపతి వైపు టమోటా లోడుతో లారీ వస్తూ భాకరాపేట ఘాట్ రోడ్డులోకి రాగానే అదుపు తప్పి లారీ బోల్తా పడింది. లారీ డ్రైవర్, క్లీనర్ క్షేమంగా బయటపడ్డారు. కొద్దిసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. చంద్రగిరి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, వాహన రాకపోకలను పునరుద్ధరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

చంద్రగిరి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం అగరాల వద్దవున్న ప్రభుత్వ పాలటెక్నిక్ కళాశాలలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని ప్రిన్సిపాల్ భక్తవత్సలం ప్రారంభించారు. ఈవైద్య శిబిరంలో 150 మంది విద్యార్థులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి 40 మందికి ఉచితంగా అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారులు, వైద్యులు, అధ్యాపకులు నాగేంద్ర, నరసింహులు, స్టూడెంట్ అడ్వైజర్ కృష్ణవేణి పాల్గొన్నారు.



నాగుల చవితి సందర్భంగా తిరుపతి మంచినీళ్ల గుంట వద్ద ఉన్న నాగాలమ్మ ఆలయంలో మహిళల పూజలు

గ్రేటర్ తిరుపతి ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ తీర్మానం

- మా పంచాయతీలను యథావిధిగా ఉంచాలి
- రూరల్ మండల సమావేశంలో వైసీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు



మాట్లాడుతున్న ఎంపీపీ చంద్రమోహన్‌రెడ్డి, పక్కన ఇన్‌చార్జి ఎంపీడీవో దయాసాగర్ తదితరులు

తిరుపతిరూరల్, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): తిరుపతి గ్రామీణ మండలంలోని పంచాయతీలను గ్రేటర్ తిరుపతిలో విలీనం చేయొద్దని మండల ఎంపీపీ, వైస్ ఎంపీపీ, జడ్పీటీసీ, పలువురు వైసీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు కోరారు. పోలీసు పహారా నడుమ శనివారం ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల సమావేశంలో గ్రేటర్ తిరుపతి ప్రతిపాదనని వ్యతిరేకిస్తూ తీర్మానం చేశారు. ఇప్పుడున్న గ్రామపంచాయతీలనే యథావిధిగా కొనసాగించాలని కోరారు. దీనిపై ఇన్‌చార్జి ఎంపీడీవో దయాసాగర్ స్పందిస్తూ అభ్యంతరాలను రాతపూర్వకంగా ఇస్తే ఉన్నతాధి కారులకు అందిస్తామని అన్నారు. ఈ సందర్భంగా వైసీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మాట్లాడుతూ గ్రేటర్ తిరుపతిలో విలీనం చేయడం వల్ల పన్నులు పెరుగుతాయన్నారు. కాగా అదేపార్టీకి చెందిన కేసీపేట, పద్మావతి పురం గ్రామపంచాయతీ సర్పంచ్‌లు పిపాసి, జ్యోతి గ్రేటర్ ప్రతిపాదనకు అంగీకరిస్తున్నామని తెలియజేశారు. అయితే ఎస్వీయూ సెనేట్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన నగరపాలక మండలి సమావేశంలో గ్రేటర్ తిరుపతిని ఆమోదించాలని వైసీపీ కార్పొరేటర్లు ప్లకార్డులతో నిరసన చేపట్టిన విషయం తెలిసిందే. అయితే రూరల్ మండల సమావేశంలో అదే వైసీపీకి చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు గ్రేటర్ తిరుపతిని వ్యతిరేకించడం గమనార్హం. ఇదిలా ఉండగా తిరుమలనగర్ పంచాయతీ తుడా క్వార్టర్స్‌కి చెందిన పేతూరయ్యకి అన్ని అర్హతలు ఉన్నా పెన్షన్ మంజూరు చేయడంలేదని గాంధీపురం ఎంపీటీసీ సభ దృష్టికి తెచ్చారు. ఎంపీపీ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. జడ్పీటీసీ రత్నమ్మ, వైస్ ఎంపీపీలు విడుదల మాధవరెడ్డి, వేముల యశోద, అర్బన్ మండల డీటీ రామచంద్ర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



గ్రేటర్ తిరుపతి ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ చేతులు పైకెత్తిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు



ట్రైనీ ఎఫ్ఎస్‌వోలు, ఎఫ్‌బీవోలకు అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

నగరవనాన్ని సందర్శించిన ట్రైనీ ఎఫ్ఎస్‌వో, ఎఫ్‌బీవోలు

మంగళం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని నగరవనాన్ని అటవీశాఖ రాజమండ్రి శిక్షణ కేంద్రం నుంచి వచ్చిన 57మంది ట్రైనీ ఎఫ్ఎస్‌వో, ఎఫ్‌బీవోలు శనివారం సందర్శించారు. వీరిలో శిక్షణ పొందిన 16మంది మహిళలు ఉన్నారు. ఈ సందర్భంగా వారికి నగరవనం చరిత్ర, రోజువారీ కార్యక్రమాలు, బయోడైవర్శిటీ, పక్షులు, వన్యప్రాణులు, వనమూలికలు, చిన్నపిల్లల పార్కు, నర్సరీ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎఫ్ఆర్వో సుదర్శన్‌రెడ్డి, ఐడీసీ చైర్మన్ శ్రీనివాసరావు, ఫ్యాకల్టీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదువుకోండి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో చదువుకుని బంగారు భవిష్యత్తుకు మార్గం వేసుకోవాలని పద్మావతి కాలేజీ ప్రిన్సిపాల్ నారాయణమ్మ కోరారు. కాలేజీలో చేరిన విద్యార్థులకు శనివారం చేపట్టిన ఓరియెం టేషన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. యూనివర్సిటీలోని సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థి నులందరూ సామాజిక స్పృహ కలిగి ఉండాలన్నారు. రిటైర్డు పొలిటికల్ సైన్స్ అధ్యాపకురాలు కృష్ణవేణి మాట్లాడుతూ.. కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు. డబ్బు కంటే విలువైంది కాలం, కాలాన్ని వృథా చేయరాదన్నారు. నైతిక విలువలను పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థినులందరికీ ఉజ్వల భవిష్యత్తు ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ డీఈవో ఆఫీసు సూపరింటెండెంట్ శివకుమార్, అధ్యాపకులు జ్యోతి, భద్రమణి, విద్యుల్లత, ఉమాదేవి, కృష్ణవేణి, కస్తూరి, శోభ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ నారాయణమ్మ



ప్రి-పరేడ్ క్యాంప్‌కు ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఎంపిక

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రి-పరేడ్ క్యాంప్‌కు పద్మావతి మహిళా యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గంగోత్రి, జయశ్రీ ఎంపికయ్యారు. వీరికి గుజరాత్‌లో శిక్షణ అందించనున్నారు. వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని వారిని అభినందించారు.

→ వలంటీర్లను అభినందిస్తున్న వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని





తిరుపతిలో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో నగరంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. మురుగు కాలువలు పొంగిపొర్లాయి. జనాలు, వాహనదారులు అవస్థలు పడ్డారు. దినసరి కూలీలు, వీధి వ్యాపారులు ఇబ్బంది పడ్డారు.







ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

తిరుచానూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. తిరుపతి రూరల్ మండలంలోని రఘునాథ రిసార్ట్స్‌లో ని టీడీపీ కార్యాలయంలో శనివారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఆరు మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

35 ద్విచక్రవాహనాల పంపిణీ



రీటైలర్లకు ద్విచక్రవాహనాలను పంపిణీ చేస్తున్న ఆర్ఎస్ఎం రమణ

తిరుపతి(ఉపాధ్యాయనగర్), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆచి మసాలా కంపెనీ తమ రీటైలర్స్‌ను ప్రోత్సహించేందుకుగాను 35 టీవీఎస్ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలను ఉచితంగా పంపిణీ చేసింది. తిరుపతి ఏఐఆర్ బైపాస్ రోడ్డులోని టీవీఎస్ కంపెనీ షోరూమ్‌లో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కంపెనీ ఆర్ఎస్ఎం రమణ తిరుపతి, అన్నమయ్య, కడప, నంద్యాల జిల్లాల రీటైలర్లకు ద్విచక్రవాహనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆచి కంపెనీ ఏఎస్ఎంలు సుబ్రహ్మణ్యం, చౌదరి, ధనుంజయ, శివకృష్ణ, కంపెనీ టీమ్, సుప్రీం డిస్ట్రిబ్యూటర్ శేఖర్, ఇతర డిస్ట్రిబ్యూటర్లు పాల్గొన్నారు.

సీఎండీ హామీతో దీక్షల విరమణ

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): ఎస్పీడీసీఎల్ స్టోర్స్ హమాలీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సదరన్ డిస్కం సీఎండీ శివశంకర్ హామీ ఇవ్వడంతో శనివారం హమాలీలు దీక్షలు విరమించారు. తిరుపతి విద్యుత్ సర్కిల్ పరిధిలో స్టోర్స్‌లో పనిచేస్తున్న హమాలీలు ఉద్యోగ భద్రత కల్పించాలని 33 రోజులుగా రిలే దీక్షలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇటీవల సీఎండీగా బాధ్యతలు తీసుకున్న శివశంకర్‌కు హమాలీ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం నాయకులతో చర్చలు జరిపి హామీ ఇచ్చారు. దీంతో డైరెక్టర్ కె.గురవయ్య దీక్షా శిబిరానికి చేరుకొని దీక్షలు విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి, జిల్లా నాయకులు బాలసుబ్రమణ్యం, హమాలీ నాయకులు ఆరోగ్యదాస్, శ్రీనివాసులు, మోహన్, సుబ్బారావు, ఓబన్న తదితరులు పాల్గొన్నారు.



సీఎండీ హామీతో స్టోర్స్ హమాలీలు దీక్షలు విరమణ చేయిస్తున్న సదరన్ డిస్కం డైరెక్టర్ కె.గురవయ్య

రుణాల చెల్లింపునకు కొత్త యాప్



హాజరైన మండల సమాఖ్య అధ్యక్షులు, మెప్మా పట్టణ సమాఖ్య అధ్యక్షులు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల రుణాల చెల్లింపునకు కొత్త యాప్‌ను తీసుకువచ్చినట్లు ఏపీ స్త్రీనిధి ఎండీ జీవీబీడీ హరిప్రసాద్ తెలిపారు. డీఆర్‌డీఏ కార్యాలయంలో స్త్రీనిధి 20వ సర్వసభ్య సమమావేశాన్ని వర్చువల్ విధానంలో నిర్వహించారు. ఆయన విజయవాడ నుంచి వర్చువల్ విధానంలో సమీక్షించారు. ఈ సమావేశానికి జిల్లాలోని మండల సమాఖ్య, మెప్మాట పట్టణ సమాఖ్య అధ్యక్షులు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఇకపై సంఘానికి రూ.8లక్షలు రుణం ఇచ్చేలా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ విద్యాలక్ష్మి, ఎన్టీఆర్ కల్యాణ లక్ష్మి పథకాల అమలుకు జనరల్ బాడీ ఆమోదం పొందిందని వివరించారు. రుణాలను తిరిగి చెల్లించేందుకు కొత్తయాప్‌ను తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ యాప్ ద్వారా మహిళలు ఇంటి వద్ద నుంచే లోన్ కట్టుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, స్త్రీనిధి ఏజీఎం హేమంత్‌కుమార్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు ప్రేమలత, స్త్రీనిధి మేనేజర్లు వీరేష్, వనజ, అదిల్‌బాషా, మురళీకృష్ణ, మల్లీశ్వరయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి



నాలుగు చవితి వేడుకల్లో పాల్గొన్న భక్తులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలోని నాగుల పుట్టల వద్ద నాగుల చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో సాగాయి. నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని రాయలసీమ రంగస్థలి అధ్యక్షులు గుండాల గోపీనాథరెడ్డి ఆధ్వర్యంలో కళాకారులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమాచార్య కళామందిర ప్రాంగణంలో ఉన్న నాగుల పుట్టకు పాలు పోసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలం ప్రతినిధులు టీచర్ తిరుమలయ్య, ఆది, గురుస్వామి, పురోహితుడు సురేష్, చిత్తరపు హనుమంతరావు కృష్ణమూర్తిరెడ్డి, మునినాథరెడ్డి, తొండమునాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, అన్నారెడ్డి రాజశేఖరరెడ్డి, కళ్యాణి, భాగ్యలక్ష్మి, పార్వతి, ధనమ్మ, యశోద, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అడుగు వేస్తే గుంత.. తీస్తే బురద

అవస్థల్లో ఒకటో డివిజన్ 6వ క్రాస్ రోడ్డు - కలగా మిగిలిన సిమెంటు రోడ్డు నిర్మాణం

తిరుపతి అర్బన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆ వీధిలో జనం అడుగు వేస్తే గుంతలో వేయాల్సిందే. తప్పనిసరి వేసినా బయటపెట్టాలన్నా మళ్లీ బురద తొక్కాల్సిందే. ఈ పరిస్థితిలో నగరపరిధిలోని ఒకటో డివిజన్ రవీంద్రనగర్ 6వ క్రాస్ వీధి జనాలు ఉన్నారు. గత వైసీపీ పాలనలో సీసీరోడ్డు వేస్తామని బాగున్న వీధిని తవ్వేశారు. నెలలు గడిచాయి. సంవత్సరం గడిచింది. సీసీరోడ్డు వేయలేదు. ఆ తరువాత ఎన్నికలు రావడంతో ఆపనులకు బ్రేక్ పడింది. తర్వాత గుంతలు తేలి చివరికి మడుగులా మారిపోయింది. గుంతల్లో నీళ్లు నిలిచి వీధి మడుగులా మారిపోయింది. స్కూల్ పిల్లలు బురదలో నడవాల్సి వస్తోంది. రాత్రివేళలలో కాలు జారి పడిపోతున్నారు. ద్విచక్రవాహనాలు అదుపు తప్పి పడిపోతున్నాయి. ఈ క్రమంలో స్థానికులు మొరపెట్టుకోవడంతో ఎట్టకేలకు నగరపాలక సంస్థ స్పందించింది. గత జూన్‌లో జరిగిన మున్సిపల్ సమావేశంలో సీసీ రోడ్డుకు ఆమోదం తెలియజేశారు. ఆ తరువాత టెండర్ ఖరారై రెండు నెలలు కావస్తున్నా పనులు మొదలుపెట్టలేదు. సంబంధిత ఇంజనీరు,కాంట్రాక్టరు నిర్లక్ష్యంతో పనులు మొదలు కాలేదు. కాగా వీధి నుంచి కులశేఖరాళ్వార్ మాస్టార్‌ప్లాన్ రోడ్డుకు అనుసంధానంగా ఉన్న మార్గంలో గుంతలు మరీ ఎక్కువగా ఉన్నాయి. గజానికో గుంత ఉంది. ప్రస్తుత వర్షాలకు ఈ గుంతలు ప్రమాదకరంగా మారాయి. వాహనదారులు అందులో పడి గాయాలపాలవుతున్నారు. నగర పాలక సంస్థ అధికారులు, పాలకులు తమ వీధిని బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు.


రవీంద్రనగర్ 6వ క్రాస్‌లో మడుగును తలపిస్తున్న వీధి - కులశేఖర ఆళ్వార్ రోడ్డు నుంచి రవీంద్రనగర్ 6వ క్రాస్‌కు వెళ్లమార్గంలో గుంతలు తేలిన రోడ్డు

నేడు విశ్వంలో ఉచిత సైనిక్ మోడల్ ఎంట్రన్స్ టెస్ట్, అవగాహనా సదస్సు

తిరుపతి(విద్య), అక్టోబరు (ఆంధ్రజ్యోతి): స్థానిక వరదరాజనగర్‌లోని విశ్వం సైనిక్, నవోదయ పోటీపరీక్షల కేంద్రంలో ఆదివారం ఉదయం 10 గంటలకు సైనిక్ మోడల్ టెస్ట్, ఉచిత అవగాహనా సదస్సు నిర్వహించనున్నట్టు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలకు 8688888802 / 03, 9399976999 సెల్‌ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సీఎంను కలిసిన ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ చైర్మన్


డాక్టర్ ఆజాద్ మూపెన్‌ను సత్కరిస్తున్న సీఎం చంద్రబాబు

తిరుపతి (కలెక్టరేట్), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): యూఏఈ పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబును ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ సంస్థ స్థాపకుడు, చైర్మన్ డాక్టర్ ఆజాద్ మూపెన్, డిప్యూటీ ఎండీ అలీషా మూపెన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆస్టర్ హెల్త్‌కేర్ సంస్థ పెట్టుబడి ప్రణాళికలు, ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య సేవల అభివృద్ధి అవకాశాలపై చర్చించారు. రాష్ట్ర ప్రజలకు అధునాతన వైద్య సదుపాయాలను అందించేందుకు, అదే విధంగా ప్రైవేటు రంగ భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు అనుకూలతలపై ఈ సమావేశంలో చర్చించారు. ఇప్పటికే తిరుపతి, విజయవాడ, విశాఖ పట్టణంలో పలు ఆస్పత్రులు నిర్వహిస్తున్నామని సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

అమ్మాయిని అమ్మోరులా పెంచాలి

సినీ దర్శకుడు మున్నా ధూళిపూడి


మున్నా, నర్సయ్య

తిరుమల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అమ్మాయిని అమ్మోరులా ధైర్యంగా పెంచాలనే సందేశంతో 'బ్యాడ్ గర్ల్స్-కానీ చాలా మంచోళ్లు' అనే సినిమా తీస్తున్నట్లు ఆ చిత్ర దర్శకుడు మున్నా ధూళిపూడి తెలిపారు. నిర్మాత ఎమ్మాడి సోమనర్సయ్య తో కలిసి ఆయన శనివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. అమ్మాయిలు తమను తాము కాపాడుకోవాలంటే సెల్ఫ్ డిఫెన్స్ నేర్పించాలన్నారు. ఆడపిల్లలకు కరాటే నేర్పిస్తే రేప్‌ల సంఖ్య తగ్గుతుందని, అందుకే బ్యాడ్ గర్ల్స్ సినిమాకు వచ్చే కలెక్షన్లతో ఆ దిశగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించామని తెలిపారు. ప్రభుత్వాలు కూడా అలాంటి చర్యలు తీసుకోవాలని సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డితోపాటు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు కూడా విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. '30 రోజుల్లో ప్రేమించడం ఎలా' అనే సినిమా తీసినా తాను ప్రస్తుతం నలుగురు అమ్మాయిలతో 'బ్యాడ్ గర్ల్స్' పేరుతో కామెడీ సినిమా తీస్తున్నానని తెలిపారు.

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 5 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.4.89 కోటు
శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 71,110
తలనీలాలు సమర్పించినవారు: 25,695

30 నుంచి శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవం

తిరుమల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ నుంచి నవంబరు ఒకటో తేదీ వరకు తిరుమల ఆస్థాన మండపంలో శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవం నిర్వహించనున్నారు. 30, 31 తేదీల్లో భజన మండళ్లతో నామసంకీర్తన, సామూహిక భజన, ధార్మిక సందేహాలు, ఉపదేశాలు, సంగీత విభావరి, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. 31న ఉదయం 4.30 గంటలకు అలిపిరి పాదాల మండపం వద్ద మెట్లపూజ నిర్వహిస్తారు. అనంతరం భజన మండలి సభ్యులు భజనలు చేస్తూ సప్తగిరీశుని చేరుకుంటారు. నవంబరు ఒకటిన సామూహిక నామసంకీర్తన, ధార్మిక సందేశం ఉంటాయి.

శ్రీవారి సేవలో ప్రముఖులు


సీవీ గణేషన్

తిరుమల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్, తమిళనాడు మంత్రి సీవీ గణేషన్ ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

73 మంది రక్తదానం


రక్తదాతలను అభినందిస్తున్న రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ - సత్యసాయి సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సత్యసాయి శత జయంతి సందర్భంగా వర్సిటీ హెల్త్ సెంటర్‌లో శనివారం చేపట్టిన ఈ రక్తదాన శిబిరాన్ని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మాదాల భూపతి నాయుడు ప్రారంభించారు. 73 మంది వలంటీర్లు రక్తదానం చేశారు. వీరిని రిజిస్ట్రార్ అభినందించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, వర్సిటీ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ దామోదరం, కో కో-ఆర్డినేటర్ పాకనాటి హరికృష్ణ, ఇంజనీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాసులురెడ్డి, సత్యసాయి ట్రస్టు ప్రతినిధులు అమరనాథ్, ఫణి, వరప్రసాద్, చక్రవర్తి, స్విమ్స్ డాక్టర్లు ప్రవీణ్, జయశ్రీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

జోరువానలోనూ నగర సంకీర్తన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి శనివారం తిరుపతి పురవీధుల్లో సాగే నగర సంకీర్తన గోవింద నామాలతో ఈ వారమూ మార్మోగింది. వర్షంలోనూ సంకీర్తన కొనసాగింది. నగర సంకీర్తన అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర సంకీర్తన మండలి సభ్యులు గుండాల గోపీనాథ్ రెడ్డి, వాసుదేవ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, మేకల గంగయ్య, నరసింహారెడ్డి, కృష్ణమూర్తి రెడ్డి, కొండే చెంగారెడ్డి, మునినాథరెడ్డి, భాస్కరాచారి పాల్గొన్నారు.

తిరుమల బాలాజీనగర్‌కు గ్యాస్ సరఫరా చేయండి

రేషన్ దుకాణం పరిశీలన, సమస్యలపై మంత్రి నాదెండ్ల ఆరా


తిరుమలలో మహిళలతో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

తిరుమల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుమలలో స్థానికులు నివాసముండే బాలాజీ నగర్‌లో మంత్రి నాదెండ్ల మనోహర్ తనిఖీలు నిర్వహించారు. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన ఆయన శనివారం శ్రీవారి దర్శనం అనంతరం సాయంత్రం జపాలి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం బాలాజీనగర్‌కు చేరుకుని సమస్యలపై కొందరు మహిళలతో మాట్లాడటంతో పాటు రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు.

గ్యాస్ డెలివరీ ఎందుకు చేయడం లేదు

తిరుమలలో గ్యాస్ గోడౌన్ లేదని, కొన్ని సందర్భాల్లో తామే గ్యాస్ తెచ్చుకోవాల్సి వస్తోందని మహిళలు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనికి మంత్రి గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులపై ఫైర్ అయ్యారు. ఇకపై గ్యాస్ సరఫరా చేయాలని ఆదేశించారు. గ్యాస్ సబ్సిడీ మూడో విడతలో కొంత జాప్యం జరిగిన మాట వాస్తవమేనని, త్వరలోనే అందరికీ అందుతుందని హామీ ఇచ్చారు.

అందరికీ బియ్యం ఇవ్వండి

కొందరికే బియ్యం ఇస్తున్నారంటూ మరికొందరు ఫిర్యాదు చేయడంతో సంబంధిత అధికారులపై మంత్రి ఆగ్రహించారు. కొత్త రైస్ కార్డులు తీసుకున్న వారందరు రాష్ట్రంలో ఎక్కడైనా బియ్యం తీసుకోవచ్చన్నారు. ఈ సందర్భంలో ఓ ఒంటరి మహిళ మంత్రితో మాట్లాడుతూ తనకు బియ్యం ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు. దీనిపై మంత్రి స్పందిస్తూ వెంటనే ఆమెకు కార్డు జారీ చేసి బియ్యం ప్రతి నెలా ఇవ్వాలంటూ ఆదేశించారు. కాగా కొందరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుపై మంత్రికి ఫిర్యాదు చేశారు. ఎన్నికల తర్వాత 'తిరిగి చూడలేదు' అంటూ మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకురాగా ఆయనతో మాట్లాడతానని మంత్రి బదులిచ్చారు.

పీఎం సూర్యఘర్‌లో తిరుపతిని తొలిస్థానంలో నిలుపుదాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి అర్బన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం అమలులో తిరుపతిని రాష్ట్రంలోనే తొలిస్థానంలో నిలిపేందుకు అధికారులు, ఎన్డీయే కూటమి నాయకులు కలసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. శనివారం స్థానిక కచ్చపి ఆడిటోరియంలో పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే మాట్లాడుతూ 30వేల సూర్యఘర్ కనెక్షన్లు తిరుపతిలో ఏర్పాటు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ రూఫ్‌టాప్‌ను ఒకసారి అమర్చుకుంటే 30ఏళ్లు వినియోగించుకోవచ్చన్నారు. ప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని కాలుష్యనివారణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ సహాయ కమిషనర్ అమరయ్య, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, గంగమ్మగుడి చైర్మన్ మహేష్‌యాదవ్; జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, ఎస్పీడీసీఎల్ అధికారులు చంద్రశేఖర్, బాలాజీ, గంగాధర్, మునిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌కు ఘన స్వాగతం


నారా లోకేష్‌కు హైదరాబాదులో స్వాగతం పలుకుతున్న డాక్టర్ కోడూరు

తిరుపతి (నేరవిభాగం), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియాలో పర్యటన ముగించుకుని శనివారం హైదరా బాదులోని విమా నాశ్రయానికి చేరుకున్న మంత్రి నారా లోకేశ్‌కు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాల సుబ్రమణ్యం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తిరుపతి నియోజకవర్గానికి సంబంధించిన పలు సమస్యలపై నారా లోకేష్‌తో చర్చించారు. దీనిపై ఇటీవల కురిసిన భారీ వర్షాలతో నష్టపోయిన ప్రజలను ఆదుకోవాలని కోరారు. పలు చోట్ల రోడ్లు దెబ్బతిన్నాయని వివరించారు. డ్రైనేజీ కాలువలు, యూజీడీఎస్‌లు ఆధునీకరించాల్సిన అవసరంపై మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి వెంటనే అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. డాక్టర్ కోడూరు వెంట టీడీపీ నాయకులు పెరుమాళ్ల మధు ఉన్నారు.

వైసీపీ ఎస్సీ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నల్లాని బాబు



తిరుపతి(జీవకోన), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తిరుపతికి చెందిన నల్లాని బాబు నియమితులయ్యారు. ప్రకాశం, నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు సంబంధించి ఆయన వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వ్యవహరించ నున్నారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన వైసీపీ జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డికి, అభినయ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

గ్రేటర్ తిరుపతితో మెరుగైన వసతులు

సీఎం, డిప్యూటీ సీఎంకు కార్పొరేటర్ల కృతజ్ఞతలు



తిరుపతి(ఎంఆర్‌పల్లె), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరాన్ని గ్రేటర్ తిరుపతిగా ఆమోదం చేసింది కూటమి ప్రభుత్వమని కార్పొరేటర్లు అన్నారు. వైసీపీ నాయకులు ఈ విషయాన్ని వక్రీకరించడం శోచనీయమని విమర్శించారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తిరుపతిని అభివృద్ధి పథంలో నడిపించేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, అనగాని సత్యప్రసాద్ ఎంతో కృషి చేశారన్నారు. మునుపు 30 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఉన్న తిరుపతి ప్రస్తుతం 306 చదరపు కిలోమీటర్లకు విస్తరించడంతో కేంద్ర నిధులు అందే అవకాశం ఉందన్నారు. ఇక కౌన్సిల్‌లో శుక్రవారం జరిగిన ఘటనపై కార్పొరేటర్ నరసింహాచారి మాట్లాడుతూ అది దాడి కాదని వాగ్వాదం మాత్రమే అని స్పష్టంచేశారు. అయినా ఈ ఘటనపై ఎస్కే బాబు అనుచరుడిపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం సంతోషకరమన్నారు. కాగా డిప్యూటీ మేయర్ నారాయణనను ఏ పార్టీకి చెందిన వారు అని ఓ విలేకరి ప్రశ్నించగా తాము కూటమికి సహకరిస్తున్నామని కూటమి నాయకులమే అని తెలిపారు. కండువా ఎందుకు కప్పుకోలేదని ప్రశ్నించగా కూటమి ప్రభుత్వం తమను ఎపుడు పార్టీలోకి ఆహ్వానిస్తారో అపుడు తాము వెళ్లడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడి ఒకరి మృతి

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో రైలు ఎక్కుతూ జారి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. తిరుపతి రైల్వే సీఐ ఆశీర్వాదం కథనం మేరకు.. తిరుపతి నుంచి కొల్హాపూర్ వైపు వెళుతున్న హరిప్రియ ఎక్స్‌ప్రెస్ శుక్రవారం రాత్రి బయలుదేరే సమయంలో దాదాపు 45 సంవత్సరాలు వయస్సున్న వ్యక్తి రైలు ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడ్డాడు. దీంతో శరీరం రెండు ముక్కలై మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సురేష్ కేసు నమోదు చేశారు.

నేడు పాపవినాశనం డ్యాము వద్ద గంగపూజ

తిరుమల, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు తిరుమలలోని ఐదు జలశయాలు నిండిన క్రమంలో టీటీడీ గంగపూజ నిర్వహించేందుకు నిర్ణయించింది. ఇందులో భాగంగా అర్చకులు ఉదయం 10 గంటలకు పూజ నిర్వహించి గంగ హారతి ఇవ్వనున్నారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అధికారులు పావినాశనం డ్యాం వద్ద ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

తిరుపతిరూరల్, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తనపల్లె గ్రామపంచాయతీ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌కు సమీపంలో విద్యుత్ స్తంభానికి ఉన్న తీగలు పట్టుకుని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గుర్తుతెలియని వ్యక్తి విద్యుత్‌తీగలు పట్టుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు, స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. తిరుచానూరు పోలీసులు కేసు విచారణ చేపట్టారు.

వైసీపీవి చిల్లర రాజకీయాలు: సుధీర్



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యం వ్యవహారంతో వైసీపీ చిల్లర రాజకీయాలు చేస్తోందని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి విమర్శించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కల్తీ మద్యంపై ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలు, అబద్ధాలు చూస్తుంటే గత వైసీపీ పాలనలో ప్రజల ప్రాణాలతో ఎలా చెలగాటమాడారో తెలుస్తోందన్నారు. వారికి పశ్చాత్తాపం లేదని అర్థమవుతోందన్నారు. కల్తీమద్యం మాఫియాకు మూలకారణం గత వైసీపీ ప్రభుత్వమే అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు కల్తీ మద్యంలో సొంత పార్టీవారిని కూడా ఉపేక్షించకుండా పార్టీ నుంచి సస్పెండ్ చేసి కఠిన చర్యలకు ఆదేశించారన్నారు. నోటి దురుసు, అబాద్ధాలతో కూడిన ప్రచారం మానుకోకపోతే వైసీపీకి మరోమారు ప్రజాక్షేత్రంలో భంగపాటు తప్పదన్నారు. సమావేశంలో టీడీపీనాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడులో టీడీపీ కార్యాలయం ప్రారంభం

ఏర్పేడు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రలో టీడీపీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మండలస్థాయి సమస్యలను ఈ కార్యాలయంలోనే పార్టీ అధ్యక్షుడు పేరం నాగరాజునాయుడు సమక్షంలో చర్చించి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రెడ్డివారి గురవారెడ్డి, నైనారు పొన్నారావు, శివశంకర్‌రెడ్డి, ధనంజయలునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సురక్ష యాప్‌పై అవగాహన కల్పించాలి

శ్రీకాళహస్తి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం నిర్మూలనపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఎక్సైజ్ అధికారులకు సూచించారు. పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను శనివారం అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యాప్ ప్రజా ఆరోగ్య భద్రత ప్రథమ కర్తవ్యంగా భావించి నకిలీ మద్యం వ్యాపారులపై ఉక్కుపాదం మోపడానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు నష్టపరిహారం ఇవ్వాలి



కూలిన ఇంటిని పరిశీలిస్తున్న యానాదుల సంక్షేమ సంఘం నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టాభిగిరిజన కాలనీలో వర్షాలకు పడిపోయిన ఇళ్లకు నష్టపరిహారం ఇవ్వాలని యానాదుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తలపల చెంచుమల్లికార్జునరావు డిమాండ్ చేశారు. శనివారం పట్టాభిగిరిజన కాలనీలో కూలిన ఇళ్లను పరిశీలించారు. వర్షాలతో పనులు లేక పస్తులుంటున్నామని స్థానికులు వాపోయారు. బాధిత గిరిజనులకు తక్షణం బియ్యం నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని, ఇళ్లు పడిపోయిన వారికి నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. నాయకులు చెంగల్‌రాయులు, రామయ్య, రాములమ్మ, కల్పన, శ్రీనివాసులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నాగ శిలలకు పూజలు



శ్రీకాళహస్తి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం సూర్య భగవాన్ సన్నిధి వద్ద నాగాలయంలోని నాగశిలలకు శనివారం నాగుల చవితిని పురస్కరించుకుని శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. మహా మంగళహారతులు సమర్పించారు. ఆలయ అధికారులు, వేదపండితులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. పట్టణ వ్యాప్తగా నాగులచవితి వేడుకలను ప్రజలు జరుపుకుతున్నారు. నాగులపుట్టల వద్ద పాలు, గుడ్లు, చిమ్మిలి, సజ్జలు, పెసలు, పిండి పదార్థాలు సమర్పించి మహిళలు మొక్కులు తీర్చుకున్నారు.

పుత్తూరు వార్తలు

వేడుకగా నాగుల చవితి



అన్నదానం చేస్తున్న విజయ్‌బాబు

పుత్తూరు అర్బన్, అక్టోబర్ 25(ఆంధ్రజ్యోతి): పట్టణం రైల్వే క్వార్టర్స్ వద్ద కొలువుదీరిన నాగాలమ్మ ఆలయంలో శనివారం వేడుకగా నాగుల చవితి పర్వదినాన్ని నిర్వహించారు. భక్తులు భక్తి శ్రద్ధలతో తరలి వచ్చి పూజలు నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయబాబుకు ఘనంగా స్వాగతం పలికిన నిరాహకులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దాతలు శ్రీకాంత్, జయశ్రీ సహకారంతో విజయ్‌బాబు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ధనపాల్, సూరి, కిషోర్, మనోహర్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



వడమాలపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజల సేవ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం సర్వాలంకార భూషితుడైన పద్మావతీ అండాల్ సమేత స్వామి వారిని మాడవీదుల్లో ఊరేగించారు. భక్తులు నారికేల,కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు. ఆలయ అధికారి వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వీఎస్‌పురం చెరువు గండికి మరమ్మతులు



జేసీబీతో మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

పుత్తూరు టౌన్, అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి): వీఎస్ పురం చెరువుకు శనివారం గండి పడింది. వారం రోజులుగా కరుస్తున్న వర్షాలకు భారీ ఎత్తున నీరు చేరిపోవడంతో గండి పడింది. సర్పంచ్ బొబ్బిలి యాదవ్ ఎమ్మెల్యేకు సమాచారం అందించారు. ఎమ్మెల్యే సూచనల మేరకు చెరువుకు మరమ్మత్తులు చేపట్టారు. ఇరిగేషన్ డీఈ చంద్రశేఖర్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న లారీ

నాయుడుపేట టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - అన్నమేడు క్రాస్‌రోడ్డు జాతీయ రహదారి సమీపంలో శనివారం కారును లారీ ఢీకొంది. నెల్లూరు నుంచి బెంగళూరుకు వెళ్తున్న కారును అన్నమేడు క్రాస్‌రోడ్డు సమీపంలో లారీ ఢీకొంది. ఈప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. కారు ముందుభాగం నుజ్జునుజ్జు అయ్యింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అదుపుతప్పి రెయిలింగ్‌ను ఢీకొన్న బస్సు

పెళ్లకూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండల పరిధిలో ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు అదుపుతప్పి రెయిలింగ్‌ను ఢీకొన్న ఘటన శనివారం ఉదయం జరిగింది. శనివారం రాత్రి రాజమండ్రి నుంచి బెంగళూరుకు 34 మంది ప్రయాణికులతో బయలుదేరిన ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు పెళ్లకూరు మండల పరిధిలోని 71వ జాతీయ రహదారిపై కొత్తూరు సమీపంలో వెళ్తుండగా అదుపుతప్పి రెయిలింగ్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రయాణికులు, బస్సు సిబ్బందికి ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసులు కేసు నమోదు చేశారు.

లారీ ఢీకొని గేదె మృతి

వెంకటగిరి టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాలకేంద్ర సెంటర్‌లో శనివారం లారీ ఢీకొని గేదె మృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు సుధాకర్ తెలిపారు.





నీళ్లలోనే ఉన్న పంట పొలాలు - ఎన్ఎం కండ్రిగ రోడ్డుపై పారుతున్న పొలంలోని నీళ్లు

చెరువుల్లా పొలాలు

- మాంబట్టులో 500 ఎకరాల మునక
- వర్షం ఆగిపోయినా నీళ్లల్లోనే వరి పంట

తడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో కురిసిన వర్షం అంతంత మాత్రమే... అయితే ఎగువ ప్రాంతాల్లో పడ్డ వర్షం రైతులకు శాపంగా మారింది. మండల పరిధిలోని గత వారం రోజులుగా మోస్తరు వర్షమే కురిసింది. దీంతో కొన్ని చెరువులు పాక్షికంగా నిండాయి. అయితే ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో కాళంగినదికి చెందిన గేట్లను ఎత్తివేయడంతో ఆ నీళ్లు మాంబట్టు, వెండ్లూరుపాడు చెరువులకు చేరాయి. తెలుగుగంగ నుంచి పాముల కాలువ ద్వారా వెండ్లూరుపాడు, మాంబట్టు చెరువులకు నీళ్లు చేరుతుంటాయి. వెండ్లూరుపాడు చెరువు పరిధిలో సుమారు 1500 ఎకరాల ఆయకట్టు ఉంది. అయితే ఆ చెరువుకు ఉన్న నాలుగు కలుజులు పూడుకుపోవడంతో నిండాక నీళ్లు బయటకు వెళ్లే పరిస్థితి లేకుండాపోతోంది. దీంతో మాంబట్టు పంచాయతీ పరిధిలోని ఎన్ఎం కండ్రిగ, చిన్నమాంబట్టు గ్రామాల్లోని సుమారు 500 ఎకరాల నీటి మునిగాయి. మూడు రోజులుగా వర్షం తగ్గిపోయినా పైనుంచి వచ్చే నీళ్లతో పొలాలు నేటికీ చెరువుల్లా దర్శనమిస్తున్నాయి. ఈ ప్రాంతంలో అక్టోబరు నెల మొదటి నుంచే వ్యవసాయ పనులు మొదలవుతాయి. ప్రస్తుతం వరి పంట నాట్ల దశలో ఉంది. రైతులు ఇప్పటికే ఎకరాకు సుమారు 20వేల వరకు ఖర్చు చేశారు. నాలుగు రోజులుగా పొలాల్లో నీళ్లు నిలిచిపోవడంతో వరి పంట మొత్తం పాచిపోయిందని రైతులు లబోదిబోమంటున్నారు. ఇరిగేషన్ అధికారులు వెండ్లూరుపాడు చెరువు కలుజులకు మరమ్మతులు చేయకపోవడంతో ఇబ్బందులు తలెత్తాయని రైతులు వాపోతున్నారు.

కల్తీ మద్యాన్ని నిర్మూలించేందుకే సురక్ష యాప్



సురక్ష యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే పాశిం, అధికారులు

గూడూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యాన్ని నిర్మూలించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక దూడలకాలువ సమీపంలోని మద్యం దుకాణం వద్ద సురక్ష యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాల్లో విక్రయించే మద్యం నాణ్యమైనదా లేక కల్తీనా అని సురక్ష యాప్ ద్వారా తెలుసుకోవచ్చునన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కల్తీ మద్యం వల్ల రాష్ట్రంలో వేలాదిమంది మృతి చెందడంతో పాటు అనారోగ్యం పాలయ్యారన్నారు. వైసీపీ నాయకులు చేసిన అవినీతి, అక్రమాలను ఎదుటి వారిపై నెట్టడంలో ఆరితేరారని విమర్శించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు కరీమాబేగం, బాలకృష్ణ, ప్రసాద్, శేషమ్మ, మహేష్, సీఐ శేఖర్‌బాబు, నాయకులు శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు రాజు, కిషోర్‌నాయుడు, మధుసూదన్‌రెడ్డి, సోమిశెట్టి చెంచు రామయ్య, పెంచలయ్య, చంద్రమౌళి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు విచారణ

బాలాయపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిండిగల్లు గ్రామానికి చెందిన సర్వేపల్లి వజ్రమ్మను అదే గ్రామానికి చెందిన వెల్లంపాటి లక్ష్మీనారాయణరెడ్డి, శ్రీనివాసులురెడ్డి కులం పేరుతో దూషించి, చంపుతామని బెదిరించారని బాధితురాలు మూడు రోజుల క్రితం బాలాయపల్లి పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేసింది. శనివారం గూడూరు డీఎస్పీ గీతాకుమారి నిండిగల్లు గ్రామానికి చేరుకుని విచారణ నిర్వహించారు.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో తనిఖీలు



బస్సులను తనిఖీ చేస్తున్న రవాణాశాఖ, పోలీసు అధికారులు

చిల్లకూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బూదనం టోల్‌ప్లాజా వద్ద శనివారం రాత్రి రవాణాశాఖ, పోలీసు అధికారులు తనిఖీలు చేపట్టారు. కర్నూలు వద్ద ప్రైవేటు ట్రావెల్ బస్సు ప్రమాదానికి గురై ప్రాణనష్టం జరగడంతో అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టారు. బూదనం టోల్‌ప్లాజా వద్ద ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంవీఐ సునీల్‌రెడ్డి, ఏఎంవీఐలు ప్రభాకర్, శాంతి, చిల్లకూరు, గూడూరు రూరల్ ఎస్ఐలు సురేష్‌బాబు, తిరుపతయ్య పాల్గొన్నారు.

ఉపాధి కార్మికులకు ఈకేవైసీ నమోదు

చిట్టమూరు, అక్టోబర్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి కార్మికులకు ఈకేవైసీ నమోదు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి కార్మికులందరికీ ఈకేవైసీ తప్పనిసరి చేసింది. శనివారం టెక్నికల్ అసిస్టెంట్లు రమేష్, వీరాస్వామి, చిట్టమూరు ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు చిట్టమూరు, కొత్తగుంట గ్రామాల్లో ఉపాధి కార్మికులకు ముఖ ఆధారిత ఈకేవైసీ నమోదు చేశారు.

పీజీఆర్ఎస్ అర్జీలపై దృష్టి పెట్టండి

డక్కిలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సకాలంలో భూ సర్వే పూర్తి చేయాలని మండల సర్వేయర్ పెంచలయ్య గ్రామ సర్వేయర్లకు సూచించారు. శనివారం మండలంలోని తీర్థంపాడు సచివాలయంలో సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న పీజీఆర్ఎస్ అర్జీలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. సర్వే రికార్డులు, మ్యాప్‌లు సక్రమంగా నిర్వహించాలని, ఏవైనా సాంకేతిక సమస్యలు ఉంటే మండల రెవెన్యూ కార్యాలయానికి తెలిపాలని సూచించారు.

కర్నూలు బస్సు దుర్ఘటన భాధాకరం

గూడూరు అర్బన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు బస్సు ప్రమాద సంఘటన భాధాకరమని శ్రీకృష్ణసేవాసమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ అన్నారు. కర్నూలు జిల్లా చిన్నటేకూరు వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో 19మంది వరకు ప్రాణాలు కోల్పోవడం విచారకరమన్నారు.

28న వైసీపీ ర్యాలీ

సూళ్లూరుపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసీపీ ఆధ్వర్యంలో ఈ నెల 28న ర్యాలీ చేపడతామని ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చిన్ని సత్యనారాయణ, వైసీపీ నాయకులు వాకాటి బాబురెడ్డి, చెన్నారెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, ఐతా శ్రీధర్, రామకృష్ణారెడ్డి, బద్దెపూడి మోహన్‌రెడ్డి, ఎస్‌కే హుస్సేన్, తుపాకుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోట: మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఈనెల 28వ తేదీన గూడూరులో జరిగే బహిరంగసభ, ర్యాలీని విజయ వంతం చేద్దామని వైసీపీ మండల కన్వీనర్ పలగాటి సంపత్ కుమార్ రెడ్డి కోరారు. విద్యానగర్‌లో శనివారం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, భక్తవత్సల్‌రెడ్డి, కస్తూరయ్య యాదవ్, వెంకటకృష్ణయాదవ్, సురేంద్ర, జయదీప్, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలికల వసతిగృహంలో తనిఖీలు

కోట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడులో గల సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని శనివారం ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్ తనిఖీ చేశారు. గదులు, మరుగుదొడ్లను పరిశీలించి వార్డెన్ పద్మజకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.





గూడూరు కోర్టు ఆవరణ, తడలో నాగులపుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో నాగులచవితి

గూడూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నాగులచవితి పండుగను శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గూడూరు పట్టణంలోని కోర్టు ఆవరణ, విఘ్నేశ్వరపురంలోని నాగులపుట్ట, శివాలయం, కోదండ రామాంజనేయస్వామి ఆలయాల్లో నాగశిలలకు పూజలు నిర్వహించారు.

చిల్లకూరు: మండల కేంద్రంలోని తెలుగుగంగ కార్యాలయం సమీపంలో ఉన్న పుట్ట, శంకరన్ గిజనకాలనీలోని పుట్ట వద్ద భక్తులు పూజలు నిర్వహించారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని కైవల్యానది ఒడ్డున ఉన్న నాగ మందిరం, ఆత్మమాలిక్, రామలింగేశ్వరి స్వామి ఆలయం, కాశీపేటలోని కాశీవిశ్వనాధ స్వామి ఆలయాల్లో నాగులచవితి పూజలు నిర్వహించారు.

బాలాయపల్లి: మండల పరిధిలోని బాలాయపల్లి, సుబ్రమణ్యం, జయంపు గ్రామాల్లో నాగుల చవితి పూజలు చేశారు.

తడ: మండలంలోని అన్ని గ్రామాల్లో నాగులచవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నాగుల పుట్టలను అలంకరించి పూజలు జరిపారు. పాలు, గుడ్లు, రాగులు, సజ్జలు నైవేద్యంగా సమర్పించారు.

పెళ్లకూరు: మండలంలోని చిల్లకూరు, పెళ్లకూరు, జీలపాటూరు, శిరసనంబేడు గ్రామాల్లో నాగ దేవతల విగ్రహాలకు పాలతో అభిషేకాలు చేశారు. పుట్టల్లో పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు.

కోట: మండల పరిధిలోని పలు గ్రామాల్లో నాగులపుట్టల వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. కేశవరం, మద్దాలి, చిట్టేడు, మైక్రోటవర్‌కాలనీ, విద్యానగర్, కోట, తిన్నెలపూడి, గూడలి తదితర గ్రామాల్లో నాగులపుట్టలకు దారాలు చుట్టారు. పుట్టల్లో పాలు, కోడిగుడ్లను వదిలారు.

సూళ్లూరుపేట: పట్టనంలోని చెంగాళమ్మ ఆలయం వద్దనున్న పుట్టకు భక్తులు పూజలు చేశారు. పాలుపోసి పూజలు చేసేందుకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. సహాయ కమిషనర్ పుట్ట ప్రాంగణాన్ని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న నాగులపుట్ట, విన్నమాల రోడ్డు వద్ద ఉన్న నాగులపుట్ట, శివాలయాల్లో, స్వర్ణముఖినది వద్ద ఉన్న నాగులపుట్టల వద్ద మహిళలు పూజలు నిర్వహించారు.

ఓజిలి: మండలంలో నాగులచవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామాల్లో పుట్టల వద్దకు మహిళలు పూజలు చేశారు. పుట్టకు దారాలు చుట్టి, కోడిగుడ్లు, పాలు పుట్టలో వేసి మొక్కులు చెల్లించుకున్నారు.





సూళ్లూరుపేటలో చెంగాళమ్మ ఆలయం, నాయుడుపేటలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు

తమిళనాడు ఆర్టీసీ బస్సులో ఆత్మకూరువాసి మృతి



మృతి చెందిన శ్రీనివాసులు

నాయుడుపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఆర్టీసీ బస్సులో ఆత్మకూరువాసి శ్రీనివాసులు (42) మృతి చెందిన ఘటన నాయుడుపేట మండల పరిధిలోని పండ్లూరు సమీపంలో శనివారం జరిగింది. అర్బన్ సీఐ బాబి తెలిపిన వివరాల మేరకు... నెల్లూరు జిల్లా ఆత్మకూరుకు చెందిన శ్రీనివాసులు కొంతకాలంగా సత్యవేడులోని ఓ బార్బర్ దుకాణంలో పని చేస్తున్నాడు. శనివారం స్వగ్రామం వెళ్లేందుకు సూళ్లూరుపేటలో తమిళనాడు ఆర్టీసీ బస్సు ఎక్కి, గూడూరు టిక్కెట్ తీసుకున్నాడు. పండ్లూరు సమీపంలోకి రాగానే శ్రీనివాసులు సీటులో ముందుకు పడిపోయి ఉండటంతో అనుమానం వచ్చిన డ్రైవర్ బస్సు ఆపేసి 108కు సమాచారం అందించాడు. 108 సిబ్బంది సంఘటనాస్థలికి చేరుకుని శ్రీనివాసులు మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో డ్రైవర్ ధనంజయ బస్సును నేరుగా చిల్లకూరు పోలీసుస్టేషన్‌కు తీసుకువెళ్లారు. శ్రీనివాసులు మృతదేహాన్ని పోలీసులు గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. డ్రైవర్ ధనంజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాయుడుపేట పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు.

అధ్వానంగా జీఎన్టీ రోడ్డు





వినాయకుడి గుడి, ఆర్ఆర్ సూపర్ మార్కెట్ వద్ద రోడ్డులో గుంతలు

సూళ్లూరుపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలో ప్రధానమైన జీఎన్టీ రోడ్డు అధ్వానంగా మారింది. హోలీక్రాస్ సర్కిల్ నుంచి రైల్వేస్టేషన్ రోడ్డు వరకు భారీ గోతులు ఏర్పడి వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వర్షమొస్తేచాలు రోడ్డుపై మోకాటి లోతునీరు నిలుస్తుండడంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా కాలువలు పూడిపోయి నీరు పారకపోవడంతో మడుగులను తలపిస్తున్నాయి. అడుగడుగునా గోతులు ఏర్పడడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల భారిన పడుతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఐదుగురికి జరిమానా

ఓజిలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఐదుగురు పట్టుబడినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. వారిని నాయుడుపేట కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.10 వేల వంతున న్యాయమూర్తి జరిమానా విధించారని తెలిపారు. మరో పర్యాయం మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడితే జైలు శిక్ష విధించనున్నట్లు న్యాయమూర్తి హెచ్చరించారని ఎస్ఐ చెప్పారు.

ఘనంగా చండీయాగం



చండీయాగం చేస్తున్న వేదపండితులు

సూళ్లూరుపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో శనివారం మహాచండీయాగం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాల మండపంలో అమ్మవారి ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేసి వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ యాగం జరిపారు.

ప్రకృతి విపత్తులపై అవగాహన

కోట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపట్నం పంచాయతీ శ్రీనివాసపురంలో శనివారం ప్రకృతి విపత్తులపై అటవీశాఖ, మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. సముద్రతీరం వెంబడి ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తీరం వెంబడి అపరిచితుల వ్యక్తుల సంచారాన్ని గుర్తించి మెరైన్, అటవీశాఖ పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే సముద్రంలోకి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే స్టీమర్లు, బోట్‌లను ఎప్పటికప్పుడు పసిగట్టి మెరైన్ పోలీసులకు సహకారం అందించాలన్నారు.

అమ్మాయిని అమ్మోరులా పెంచాలి

సినీ దర్శకుడు మున్నా ధూళిపూడి

తిరుమల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అమ్మాయిని అమ్మోరులా ధైర్యంగా పెంచాలనే సందేశంతో 'బ్యాడ్ గర్ల్స్-కానీ చాలా మంచోళ్లు' అనే సినిమా తీస్తున్నట్లు ఆ చిత్ర దర్శకుడు మున్నా ధూళిపూడి తెలిపారు. నిర్మాత ఎమ్మాడి సోమనర్సయ్యతో కలిసి ఆయన శనివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. అమ్మాయిలు తమను తాము కాపాడుకోవాలంటే సెల్ఫ్ డిఫెన్స్ నేర్పించాలన్నారు. ఆడపిల్లలకు కరాటే నేర్పిస్తే రేప్‌ల సంఖ్య తగ్గుతుందని, అందుకే బ్యాడ్ గర్ల్స్ సినిమాకు వచ్చే కలెక్షన్లతో ఆ దిశగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించామని తెలిపారు.

30 నుంచి శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవం

తిరుమల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ నుంచి నవంబరు ఒకటో తేదీ వరకు తిరుమల ఆస్థాన మండపంలో శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవం నిర్వహించనున్నారు. 30, 31 తేదీల్లో భజన మండళ్లతో నామసంకీర్తన, సామూహిక భజన, ధార్మిక సందేహాలు, ఉపదేశాలు, సంగీత విభావరి ఉంటాయి. 31న ఉదయం 4.30 గంటలకు అలిపిరి పాదాల మండపం వద్ద మెట్లపూజ నిర్వహిస్తారు. అనంతరం భజన మండలి సభ్యులు భజనలు చేస్తూ సప్తగిరీశుని చేరుకుంటారు. నవంబరు ఒకటిన సామూహిక నామసంకీర్తన, ధార్మిక సందేశం ఉంటాయి.

నిత్యావసర సరుకుల వితరణ



శ్రీకాళహస్తి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వర్షాలకు ఇబ్బందులు పడుతున్నము ళ్లపూడి ఎస్టీకాలనీలోని 60 కుటుంబాలకు వే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పైడి అంకయ్య శనివారం నిత్యావసర సరుకులు, బ్రెడ్లు, పాలు అందజేశారు. కూరగాయలను అందించిన రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రమేష్‌నాథ్, పాలు, బ్రెడ్ అందించిన ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్టు తహసున్నిసా బేగంకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య, ప్రజానాట్య మండలి కార్యదర్శి గురవయ్య, మించల శివకుమార్, మునిచందు, జనార్థన్ తదితరులు పాల్గొన్నారు.

నిండిన కళత్తూరు చెరువు..పారుతున్న కలుజు



కేవీబీపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో చెరవులు నిండాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆరె పెద్దచెరువు, పాతపాళెం రాయలచెరువు, కళత్తూరు పెద్ద చెరువు నిండి కలుజు పారుతోంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అక్టోబరులోనే చెరువులు నిండటంతో రాబోయే వర్షాలకు మరిన్ని నీరు చెరువుల్లో చేరి వ్యవసాయానికి ఢోకా ఉండదని రైతులు అనందం వ్యక్తం చేస్తున్నారు.

కాళంగి గేట్ల మూసివేత

కేవీబీపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కాళంగి జలాశయం పూర్తిగా నిండటంతో 217 సామర్థ్యంతో గేట్లన్ని మూసివేశారు. శనివారం ఇరిగేషన్ ఈఈ శివారెడ్డి, డీఈ రత్నారెడ్డి, మెకానికల్ డీఈ జనార్దన్‌రెడ్డి, ఏఈ బాబు జలాశయ 18 గేట్లలో ప్రధానమైప మూడింటిని పరిశీలించారు. ఇందులో కొత్తగా 8 గేట్లను ఏర్పాటు చేసినట్లు మెకానికల్ డీఈ జనార్దన్‌రెడ్డి ఈఈకి వివరించారు. జలాశయం నిండుకుండలా ఉంది. ప్రస్తుతానికి ప్రమాద సూచికలు ఏమి లేవని వారు తెలిపారు.

పీపీపీ విధానంతో పేదలకు వైద్యవిద్య



మాట్లాడుతున్న టీడీపీనాయకులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల పీపీపీ విధానంతో ఎక్కువ మంది పేద విద్యార్థులకు వైద్యవిద్య అందుతుందని టీడీపీ రాష్ట్ర బీసీ విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్‌రావు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలను మభ్యపెట్టడానికే వైసీపీ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టిందన్నారు. పాత విధానంలో 213 మెడికల్ సీట్లు ఉచితంగా రాగా, కొత్త పీపీపీ విధానంలో 850 మెడికల్ సీట్లు వస్తాయన్నారు. దీని ద్వారా పేద విద్యార్థులు తమ డాక్టర్ కలను సాకారం చేసుకోవచ్చన్నారు. వన్నెకుల క్షత్రియ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, టీడీపీ నాయకులు భీమాల భాస్కర్, వజ్రం కిషోర్, కోట చంద్రశేఖర్, మణి, సులేమాన్, రమేష్ పాల్గొన్నారు.

శనీశ్వరస్వామికి తైలాభిషేకం

శ్రీకాళహస్తి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనీశ్వరస్వామికి శనివారం వేదోక్తంగా పూజలు నిర్వహించారు. కలశ ప్రతిష్ట చేసి మొదట గణపతి పూజ, కలశ పూజను చేశారు. అనంతరం స్వామివారికి నువ్వుల నూనె, మంచినూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. స్వామివారిని పుష్పాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు

ఆలయాల అభివృద్ధికి సహకరించండి

శ్రీకాళహస్తి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆలయాల అభివృద్ధికి సహకరించాలని టీటీడీ జేఈవో వెంకయ్య చౌదరిని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి కోరారు. జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం టీటీడీ జేఈవో వెంకయ్య చౌదరి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయనను ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. ఆలయ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చెరువులో వ్యక్తి మృతదేహం లభ్యం

రేణిగుంట అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన వ్యక్తి స్వర్ణముఖి నది చెరువులో శవమై తేలాడు. ఎస్ఐ సుధాకర్ కథనం మేరకు ఇస్లాపురానికి చెందిన హరినాథయ్య(50) కొంతకాలంగా తండ్లంలో బంధువుల ఇంట్లో ఉంటున్నాడు. రెండు రోజుల క్రితం ఉదయం బహిరూభమికి వెళ్లాడు. ఈక్రమంలో స్వర్ణముఖి నది ప్రాంతంలో కొందరు అక్రమంగా ఇసుక కోసం తవ్వేసిన చెరువు గుంత నీటిలో మునిగిపోయాడు. శనివారం రాత్రి స్థానికులు ఇతడి మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు చెప్పారు. మృతదేహాన్ని బయటకు తీశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఒంటరి మహిళ హత్య

● బంగారం కోసమేనా ఈ దురాగతం...?



మునిలక్ష్మి మృతదేహం

నాగలాపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఒంటరిగా ఉంటున్న ఓ మహిళ హత్యకు గురైంది. సీఐ రవీంద్ర కథనం ప్రకారం హత్య చేసిన నాగలాపురం మండల బీసీ కాలనీలో మునిలక్ష్మి(55) పెళ్లయిన మూడేళ్లకే భర్తను కోల్పోయింది. స్థానిక ఓ హోటల్‌లో పని చేస్తుంది. శుక్రవారం పనికి వెళ్లి రాత్రి ఇంటికి చేరుకుంది. శనివారం పనికి రాలేదని యజమాని ఆమె పక్కింటి వాళ్ళకి ఫోన్ చేశాడు. దీంతో వారు వెళ్లి చూడగా మునిలక్ష్మి విగతజీవిగా పడిఉంది. గొంతు వద్ద గాయం ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ రవికుమార్, సీఐ రవీంద్ర,ఎస్ఐ సునీల్ చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. బంగారు గొలుసు, వేలి ఉంగరం కోసమే మునిలక్ష్మిని దుండగులు హత్య చేసేందుకు భావిస్తున్నారు.

సబ్‌స్టేషన్‌కు టెండర్లు పిలవండి



శివశంకర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వయుడి యూరు(కొత్తగొల్లకండ్రిగ)లో ప్రభుత్వం మంజూరు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్‌కు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం విద్యుత్‌శాఖ సీఎండీ శివశంకర్(ఐఏఎస్)ను కోరారు. శనివారం తిరుపతిలో సీఎండీని కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్త గొల్లకండ్రిగలో చివరి దశ నిర్మాణంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌ను త్వరగా పూర్తి చేసి ప్రారంభించాలని కోరారు. నియోజకవర్గంలోని విద్యుత్ సమస్యలను సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

రెండు బైకులు ఢీకొని ఒకరు దుర్మరణం

రేణిగుంట అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. హైవే పెట్రోలింగ్ పోలీసుల కథనం ప్రకారం శ్రీకాళహస్తి కొత్తనూరుకు చెందిన వెంకటేష్, శనివారం తన భార్య శాంతితో కలిసి గుత్తివారిపల్లి వెళ్తున్నాడు. హైవే సర్వీస్ రోడ్లో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం వీరిని ఢీకొంది. దీంతో వెంకటేష్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిని మృతుడి భార్య శాంతి, మరో ఇద్దరు యువకులను ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తుఫాన్ పట్ల అప్రమత్తంగా

రేణిగుంట అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి); రానున్న తుఫాన్ పట్ల పంచాయతీ కార్యదర్శులు,సచివాలయం సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో రవి చంద్ర ఆదేశించారు. 29 తేదీ వరకు తుఫాన్ ప్రభావం అధికంగా ఉంటుందన్నారు మూడు రోజులపాటు అందుబాటులో ఉండాలని సర్కులర్ జారీ చేసినట్టు ఎంపీడీవో తెలిపారు.

భక్తి శ్రద్ధలతో నాగుల చవితి

కేవీబీపురం: ప్రజలు పుట్టల వద్దకు వెళ్లి నాగాలమ్మకు పాలు, గుడ్లు, పిండి పదార్థాలను సమర్పించి మొక్కులుచెల్లించుకున్నారు. పుట్టదారం చుట్టారు.

బుచ్చినాయుడుకండ్రిగ: నాగుల చవితి పండుగలను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పాము పుట్టల దగ్గర ప్రత్యేక పూజలు చేసి, పాలు పోసి నైవేద్యం సమర్పించారు.

పిచ్చాటూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటా నాగుల చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.

అధికారుల తనిఖీలు

పిచ్చాటూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరులో జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ దుకాణాలను తనిఖీలు నిర్వహించారు. కాటా, తూకం సామగ్రిని పరిశీలించారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం

బాలాయపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలిమిలి ఫారెస్టులో నిల్వచేసిన పది ఎర్రచందనం దుంగలను శనివారం అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసున్నారు. డీఆర్‌వో సుహాసిని మాట్లాడుతూ పొదల్లో పది దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు

వర్షాలకు కుళ్లిన వరిపంట



బీఎన్‌కండ్రిగ ఎన్టీఆర్‌నగర్‌లో వర్షాలకు కుళ్లిపోయిన వరిపంట

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. తలారివెట్టు, ఎన్టీఆర్‌నగర్, కల్లివెట్టు గ్రామాల్లో నీరు నిల్వ చేరిపోవడంతో 50 ఎకరాలలోని వరి కుళ్లిపోయింది. కారణిమిట్టలో రైతు శ్రీనివాసులురెడ్డి ఐదెకరాల వరి పంట నీట మునిగింది. కాంపాళెం, సీర్పాకోట, కారణి, కుక్కంబాకం, చిన్నపాలేడు, పల్లమాల చెరువులు నిండి చెరువులు కలుజులు పారుతున్నాయి. మరోపక్క వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో తహసీల్దార్ శ్రీదేవి అధికారులను అప్రమత్తం చేశారు. తహనగర్, చిన్నాయగుంట, జంబుగోళం గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

జాబ్‌మేళాలో 163 మంది ఎంపిక



నియామకపత్రాలు అందజేస్తున్న సుధీర్

శ్రీకాళహస్తి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విక్రమ్ డిగ్రీ కళాశాలలో శనివారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్సేంజ్, సీడాప్ ఆధ్వర్యంలో ఉద్యోగా మేళా నిర్వహించారు. సుమారు 15కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలునిర్వహించారు. ఎంపికైన పలువురికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి నియామకపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో స్కిట్‌లో కూడా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తామన్నారు. 312 మంది అభ్యర్థులు హాజరు కాగా 163మంది ఎంపికయ్యారు. లోకనాథం, డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రైవేటు బస్సుల తనిఖీ

శ్రీకాళహస్తి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదం సంఘటన నేపథ్యంలో శనివారం ఏపీసీడ్స్ కూడలి వద్ద ప్రైవేటు బస్సులపై అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ నరసింహమూర్తి, మోటారు వెహికల్ అధికారి దామోదర్‌నాయుడు, 1టౌన్ సీఐ ప్రకాష్ ఆధ్వర్యంలో దాడులు చేశరు. డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్‌తో పాటు వాహనాలకు సంబంధించి వివిధ పరీక్షలను నిర్వహించారు. ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యబొమ్మల శిక్షణ ప్రారంభం

శ్రీకాళహస్తి; అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కళాసృష్టి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో శనివారం కొయ్యబొమ్మల గురు-శిష్య హస్తశిల్ప్ పరంపర శిక్షణా కార్యక్రమాన్ని హస్తకళల రీజనల్ డైరెక్టర్(సౌత్‌జోన్) లక్ష్మణరావు ఆతుకూరి ప్రారంభించారు. సుమారు 50మంది కళాకారులు పాల్గొన్నారు. వారిలో 30మందిని ఎంపిక చేసి వారికి రెండు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. సంస్థ కార్యదర్శి గుమ్మడిపూడి దశరథాచారి, హ్యాండీక్రాఫ్ సర్వీస్‌సెంటర్ ఏడీ సత్యమూర్తి, కోలా విశాలాక్షి, పూడి బాలకృష్ణ, గుమ్మడిపూడి బాలాజీ, పెద్దపాళెం రవి, తదితరులు పాల్గొన్నారు.

భవన కార్మికులను ఆదుకోవాలని వినతి

రేణిగుంట అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి): భవన కార్మికులకు సహాయం అందజేయాలని సీఐటీయూ నాయకులు శనివారం తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డికివినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ భారీ వర్షాలకు భవన, ఆటో, అమాలి కార్మికులు ఉపాధి కోల్పోతున్నారన్నారు